క్లుప్తంగా

హాకీలో రాణించాలి



హాకీ శిక్షణ శిబిరాన్ని ప్రారంభిస్తున్న కార్యదర్శి సుధీర్

కర్నూలు (టౌన్): ఈ నెలాఖరు వరకు నిర్వహిస్తున్న ఉచిత హాకీ శిక్షణ శిబిరాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని హాకీ కర్నూలు కార్యదర్శి దాసరి సుధీర్ సూచించారు. మంగళవారం స్థానిక మున్సిపల్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో హాకీ సమ్మర్ క్యాంపు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి సెలవులను వృథా చేయకుండా ప్రతి విద్యార్థి ఆసక్తి ఉన్న క్రీడాంశంలో రాణించాలన్నారు. సమ్మర్ క్యాంపులో మెలకువలు నేర్చుకొని జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక కావాలన్నారు. కార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షులు ప్రవీణ్, కోశాధికారి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో చందన యాత్ర ఉత్సవాలు



ప్రత్యేక అలంకారంలో జగన్నాథ్, బలదేవ్, సుభద్ర దేవతా మూర్తులు

కర్నూలు కల్చరల్: ఇస్కాన్ ఆధ్వర్యంలో భగీరథ కాంప్లెక్స్‌లోని జగన్నాథ మందిరంలో చందన యాత్ర ఉత్సవాలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. జగన్నాథ్, బలదేవ్, సుభద్ర దేవతా మూర్తులకు చందన సేవ, అలంకార సేవ, అభిషేక సేవ, సంపూర్ణ నిత్య నైవేద్యం సేవలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఇస్కాన్ బాధ్యులు రామకృష్ణ ప్రభు సందేశం ఇచ్చారు. పరమ పవిత్రమైన వైశాఖ మాసంలో సమస్త మానవాళికి శుభం కలుగ చేయడం కోసం జగన్నాథ స్వామికి వైశాఖ శుద్ధ మాసంలో చందన యాత్ర ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

భవన నిర్మాణాల తనిఖీ



ఫ్లోర్, పిల్లర్లను కూల్చేస్తున్న టౌన్ ప్లానింగ్ సిబ్బంది

కర్నూలు (టౌన్): నగర పాలక సంస్థ పరిధిలో భవన నిర్మాణాలపై పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు మంగళవారం తనిఖీలు నిర్వహించారు. స్థానిక బళ్లారి చౌరస్తా సమీపంలోని రాజీవ్‌నగర్‌లో అనుమతులు లేకుండా నిర్మించిన అదనపు ఫ్లోర్‌ను కూల్చివేశారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జ్ సిటీ ప్లానర్ మోహన్ కుమార్ మాట్లాడుతూ నగరపాలక పరిధిలో చేపట్టే భవన, వాణిజ్య భవనాలకు తప్పకుండా పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు అనుమతులు తీసుకోవాలన్నారు. లేకుంటే శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్ హరీష్ చౌదరి, సిబ్బంది పాల్గొన్నారు.

రత్నలక్ష్మికి కవిశ్రేష్ఠ బిరుదు ప్రదానం



రత్నలక్ష్మికి బిరుదును ప్రదానం చేస్తున్న అతిథులు

కర్నూలు కల్చరల్: రచయిత్రి ఎస్.రత్నలక్ష్మికి కవి శ్రేష్ఠ బిరుదును ప్రదానం చేశారు. తెలుగు వెలుగు సాహిత్య వేదిక, ఎస్వీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏప్రిల్ 30న హైదరాబాద్ పటాన్‌చెరువులో నిర్వహించిన జాతీయ సాహిత్య సంబరాల్లో నంద్యాల జలవనరుల శాఖ తెలుగుగంగ కార్యాలయంలో ఇంజినీర్‌గా విధులు నిర్వహిస్తున్న రత్నలక్ష్మి రాసిన కవితను ఉత్తమ కవితగా ప్రకటించారు. ఈ మేరకు ఆమెకు జాతీయ సాహిత్య పురస్కారంతో పాటు కవిశ్రేష్ఠ బిరుదును ప్రదానం చేశారు. కేంద్ర సాహిత్య అకాడమీ సభ్యులు, తెలంగాణ రాష్ట్ర సాహిత్య అకాడమీ మాజీ చైర్మన్ నాళేశ్వరం శంకరం బిరుదును ప్రదానం చేసి సన్మానించారు.

సాక్షి సినిమాలు

ఎస్‌వీసీ కాంప్లెక్స్ : పొన్నియిన్ సెల్వన్–2 ఏజెంట్,విరుపాక్ష ,సిసు,ఇవిల్‌డెడ్ రైజ్ శాకుంతలం
వి మెగా ఆనంద్ సినీ కాంప్లెక్ : పొన్నియిన్ సెల్వన్–2 ,ఇవిల్‌డెడ్ రైజ్,దసరా విరుపాక్ష ,ఏజెంట్
వెంకటేష్ సినీ కాంప్లెక్స్ : ఏజెంట్, విరుపాక్ష ,
ఐనాక్స్ : ఇవిల్‌డెడ్ రైజ్, సిసు కిసీ కా భాయ్ కిసీ కా జాన్ పొన్నియిన్ సెల్వన్–2,సుజుమె
భరత్ కాంప్లెక్స్ : కిసీ కా భాయ్ కిసీ కా జాన్, ఇవిల్‌డెడ్ రైజ్, దసరా
శ్రీరామ: ఏజెంట్
రాజ్ : పొన్నియిన్ సెల్వన్–2
విజయ : విరుపాక్ష

బీమా.. పేద కుటుంబాలకు ధీమా

- పీఎంజేజేబీవై కింద 18–50 ఏళ్లలోపు వారికి బీమా
- ప్రమాదవశాత్తూ లేదా సాధారణ మరణమైనా పరిహారం
- పీఎంఎస్‌బీవై కింద 18–70 ఏళ్లలోపు వారికి అవకాశం
- ప్రమాద మరణానికి రూ.20 లక్షల పరిహారం

సామాన్య, మధ్య తరగతి కుటుంబాల్లో యజమాని మరణిస్తే ఆ కుటుంబానికి తీరనిలోటు ఏర్పడుతుంది. సంపాదించే వ్యక్తి మరణిస్తే ఆ కుటుంబం వీధిన పడుతుంది. అలాంటి కుటుంబాలకు కేంద్రప్రభుత్వం అండగా నిలుస్తోంది. ప్రధానమంత్రి జీవన్‌జ్యోతి బీమా యోజన, ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన పథకాలతో ఆర్థిక ధీమానిస్తోంది.
– కర్నూలు(అగ్రికల్చర్)

కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ప్రధానమంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన(పీఎంజేజేబీవై), ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన (పీఎం ఎస్‌బీవై) పథకాలు పేద కుటుంబాలకు అండగా నిలుస్తున్నాయి. ఈ పథకాలను కొన్నేళ్ల క్రితమే ప్రారంభించినప్పటికీ పూర్తిస్థాయిలో గ్రామీణ ప్రజలకు చేరలేదు. ఈ నేపథ్యంలో ఈ బీమా పథకాలను ప్రజల దగ్గరకు చేర్చేందుకు ప్రత్యేక కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఇందుకోసం జూన్ 30 వరకు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ వెంకటనారాయణ తెలిపారు.

ఖాతా కలిగి ఉంటే చాలు

జిల్లాలోని 488 గ్రామ పంచాయతీలతో 142 బ్యాంకు శాఖలను మ్యాపింగ్ చేశారు. బీమా పథకాలను



వినియోగించుకోవడానికి అర్హత కేవలం బ్యాంకులో ఖాతా కలిగి ఉండటమే. ఏటా మే 20 నుంచి 30 మధ్య ప్రీమియం చెల్లించాల్సి ఉంది. జూన్ 1 నుంచి మే 31 వరకు బీమా ఉంటుంది. పీఎంజేజేబీవై కింద బీమా సదుపాయం పొందడానికి 18 నుంచి 50 ఏళ్ల



లోపు వారు అర్హులు. బీమా పొందేందుకు ఏటా రూ.436 చెల్లించాల్సి ఉంది. ప్రమాదవశాత్తూ లేదా సాధారణంగా మరణించినా రూ.2 లక్షల పరిహారం లభిస్తుంది. పీఎంఎస్‌బీవై ప్రమాదవశాత్తూ జరిగిన మరణాలకే వర్తిస్తుంది. బ్యాంకుల్లో ఖాతా కలిగిన వారు ఏటా కేవలం రూ.20 మాత్రమే చెల్లించాలి. ప్రమాదవశాత్తూ మరణించినా లేదా రెండు కళ్లు, రెండు కాళ్లు, రెండు చేతులు కోల్పోయినా రూ.2 లక్షల పరిహారం లభిస్తుంది. పాక్షిక అంగవైక్యలం కలిగితే రూ.లక్ష పరిహారం లభిస్తుంది. 18 నుంచి 70 ఏళ్లలోపు వారందరు ప్రమాద బీమాకు అర్హులు. ఇప్పటి వరకు పీఎంజేజేబీవై కింద 7.58 లక్షల మంది, పీఎంఎస్‌బీవై కింద 15.15 లక్షల మంది బీమా పొందారు. కొన్ని పంచాయతీల్లో ఈ బీమా పథకం కింద ఒక్కరు కూడా నమోదు కాలేదు.

స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నాం



బీమా పథకాలను స్పెషల్ డ్రైవ్ ద్వారా ప్రజల్లోకి తీసుకెళ్లి అవగాహన కల్పిస్తున్నాం. పేద, మధ్య తరగతి కుటుంబాలకు ఈ బీమా పథకాలు ఎంతో దోహదపడతాయి. పంచాయతీల వారీగా జరిగే అవగాహన కార్యక్రమాలకు బ్యాంకర్లు కూడా హాజరవుతారు. బ్యాంకుల్లో ఖాతాలు కలిగిన వారు సంబంధిత బ్యాంకుల్లో బీమా కోసం దరఖాస్తు చేసుకుంటే బీమా వర్తింపజేస్తారు. – వెంకటనారాయణ, ఎల్‌డీఎం

పేర్లు మారవేమీ?



కర్నూలు (న్యూటౌన్): కర్నూలు రూరల్ తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన సమాచార హక్కు చట్టం బోర్డులో అధికారుల పేర్లు మారడం లేదు. గతంలో పనిచేసిన అధికారుల పేర్లు నేటికీ కొనసాగుతున్నాయి. గతంలో డిప్యూటీ తహసీల్దార్‌గా పని చేసి ఏసీబీ అధికారులకు పట్టుబడిన ఎస్ జలాలుద్దీన్ పేరు సహాయ పౌర సమాచార అధికారిగా, రెండు నెలల క్రితం కర్నూలు రూరల్ తహసీల్దార్‌గా పనిచేసి బదిలీపై దేవనకొండకు వెళ్లిన డి.వెంకటేష్ నాయక్ పేరు పౌర సమాచార అధికారిగా బోర్డులో దర్శనమిస్తున్నాయి. అధికారులు మారినా వారి పేర్లు మారకపోవడంపై ఆయా గ్రామాల ప్రజలు గందరగోళానికి గురవుతున్నారు. ఇక్కడ తహసీల్దార్ పేరేంటి సార్.. డిప్యూటీ తహసీల్దార్ ఎవరు అంటూ కార్యాలయానికి వివిధ పనుల నిమిత్తం వచ్చిపోయే వారంతా అక్కడున్న వారిని ప్రశ్నిస్తున్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత

కర్నూలు(రాజ్‌విహార్): ప్రజలు ఎదుర్కొంటున్న స్థానిక సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు కర్నూలు ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్ తెలిపారు. మంగళవారం స్థానిక పాతబస్తీలో తన కార్యాలయంలో ఎమ్మెల్యే దర్బార్ కార్యక్రమం ద్వారా వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా ప్రజలు చెప్పుకున్న సమస్యలను ఆయన శాఖల అధికారుల దృష్టికి తీసుకెళ్లి నిర్ణీత గడువులోపు పూర్తి చేయాలని సూచించారు. సమస్యలు ఎదురైనప్పుడు ఎవరి సిఫార్సు లేకుండా నేరుగా తనను కలిసి చెప్పుకోవచ్చన్నారు.



అర్జీని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్

ప్రజలకు అందుబాటులో ఉండండి

కర్నూలు(రాజ్‌విహార్): ప్రజలకు అందుబాటులో ఉండి ఎప్పటికప్పుడు సమస్యలు పరిష్కరించాలని దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ కర్నూలు ఆపరేషన్స్ రూరల్స్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు వై.సుబ్బన్న సూచించారు. మంగళవారం ఆయన కింది స్థాయి అధికారులు, ఇబ్బందితో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొద్ది రోజులుగా వర్షాలు పడుతున్న కారణంగా విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడే అవకాశం ఉందన్నారు. ప్రజలు ఫిర్యాదు చేసిన వెంటనే స్పందించి పరిష్కరించాలన్నారు.

వాల్‌పోస్టర్లు విడుదల

కర్నూలు సిటీ: ఈ నెల 7న బీఎస్పీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న చలో హైదరాబాద్ కార్యక్రమ వాల్‌పోస్టర్లను మంగళవారం ఆ పార్టీ నాయకులు కరుణాకర్, వనములయ్య, రేపల్లే రాజు, రాజ్‌కుమార్, అంబేడ్కర్ బిర్లాగేటులోని పార్టీ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బహుజనుల హక్కుల సాధన కోసం స్థాపించిన పార్టీ బీఎస్పీ అని, రాజ్యాంగాన్ని రక్షించేందుకు ప్రతి ఒక్కరు బాధ్యతగా పనిచేయాలని కోరారు. పార్టీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్



వాల్‌పోస్టర్లు విడుదల చేస్తున్న నాయకులు

ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో జరగనున్న చలో హైదరాబాద్ – తెలంగాణ భరోసా సభకు పార్టీ జాతీయ అధ్యక్షురాలు బెహన్ కుమారి మాయావతి హాజరుకానున్నారన్నారు. బహుజనులు పెద్ద ఎత్తున పాల్గొని సభ జయప్రదం చేయాలని కోరారు.

ఎస్‌డీపీఐ సభ్యత్వ నమోదు

కర్నూలు కల్చరల్: ఎస్‌డీపీఐ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించామని సంఘం అధ్యక్షులు అష్ఫాక్ హుసేన్ తెలిపారు. మంగళవారం నగరంలోని పలు ప్రాంతాల్లో సభ్యత్వం ప్రారంభించారు. ఈ సదర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 31వ తేదీ వరక కొనసాగుతుందన్నారు. నాయకులు అబ్దుల్ సలాం, జలీల్ అహ్మద్, షేక్ షఫీ పాల్గొన్నారు.

రేపు తరిగొండ వెంగమాంబ జయంతి

కర్నూలు కల్చరల్: ఓల్డ్‌సిటీ జమ్మిచెట్టు సమీపంలోని లలితా పీఠంలో ఈనెల 4వ తేదీ సాయంత్రం 6 గంటలకు మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ జయంతి, శ్రీ నరసింహ స్వామి జయంతి కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తరిగొండ వెంగమాంబ సేవా సమితి కార్యవర్గ సభ్యులు తెలిపారు. ఆధ్యాత్మిక ప్రవచకులు, ఉపాధ్యాయురాలు కర్నాటి చంద్రమౌళిని ప్రధాన వక్తగా హాజరు కానున్నట్లు పేర్కొన్నారు. లలితా పీఠం పీఠాధిపతి మేడా సుబ్రహ్మణ్య స్వామి, యోగా గురువు పెరుమాళ్ల దత్తయ్య, తిరుమల తిరుపతి దేవస్థానములు, హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి జిల్లా కార్య నిర్వాహకులు డాక్టర్ మల్లు వెంకటరెడ్డి అతిథులుగా హాజరు కానున్నట్లు తెలిపారు.

సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లు



లబ్ధిదారులతో మాట్లాడుతున్న పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

- ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

కల్లూరు: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా భావించి పాలన అందిస్తున్నారని వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. మంగళవారం సాయంత్రం కల్లూరు అర్బన్ 41వ వార్డు 107వ సచివాలయం పరిధిలోని లెప్రసీ కాలనీ, నేతాజీ హౌసింగ్ కాలనీలో కార్పొరేటర్ శ్వేతారెడ్డి ఆధ్వర్యంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాటసాని ఆయా కాలనీలో పర్యటిస్తూ నాలుగేళ్ల కాలంలో చేసిన మంచిని వివరిస్తూ ముందుకు సాగారు. కాలనీలో ఏవైనా సమస్యలు ఉంటే తనకు తెలియజేయాలన్నారు. ఆయా కాలనీలో ప్రజలు కల్వర్టులు, డ్రైనేజీలు నిర్మించాలని కోరగా ఎమ్మెల్యే స్పందిస్తూ వీలైనంత త్వరగా సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అవినీతి రహితంగా, సంక్షేమ పథకాల లబ్ధిలో మధ్యవర్తుల ప్రమేయం లేకుండా పాలన అందిస్తున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని రాబోయే ఎన్నికల్లో మరోసారి ఆదరించాలని కోరారు. కార్యక్రమంలో కల్లూరు సింగిల్ విండో చైర్మన్ శివశంకర్‌రెడ్డి, కార్పొరేటర్ లక్ష్మీకాంతరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు కేవీ రమణారెడ్డి, షరీఫ్‌మియ్య, మాబుసా, గంగులు, ప్రతాప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రైతులను ఆదుకోవాలి

కర్నూలు కల్చరల్: అకాల వర్షాల వల్ల నష్టపోయిన రైతులను ఆదుకోవాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.జగన్నాథం కోరారు. సంఘం నాయకులు డీఆర్‌వో నాగేశ్వరరావుకు వినతి పత్రం ఇచ్చారు. ఇటీవల కురిసిన వర్షాలకు మిరప, మొక్కజొన్న, వరి తదితర పంటలు తడిసిపోయి రైతులకు తీవ్ర నష్టం వాటిల్లిందని, అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి ప్రభుత్వం నుంచి పరిహారం ఇప్పించాలని కోరారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో సీపీఐ నగర కార్యదర్శి రామకృష్ణారెడ్డి, సహాయ కార్యదర్శి మహేష్, నాయకులు భీసన్న, బాబయ్య, నీలకంఠ ఉన్నారు.



డీఆర్‌ఓకు వినతి పత్రం అందజేస్తున్న రైతు సంఘం నాయకులు

గడప గడపకూ.. పరిష్కారం

- నగరంలో ఎమ్మెల్యేల విస్తృత పర్యటనలు
- పలు సమస్యల గుర్తింపు
- వాటి పరిష్కారానికి నిధులు మంజూరు
- త్వరలో పనులు ప్రారంభం

కర్నూలు (టౌన్): గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం సమస్యల పరిష్కారం వేదికగా మారింది. కర్నూలు, పాణ్యం, కోడుమూరు పరిధిలోని 52 వార్డుల్లో ఆయా నియోజకవర్గాల ఎమ్మెల్యేలు హఫీజ్‌ఖాన్, కాటసాని రాంభూపాల్‌రెడ్డి, డాక్టర్ జరదొడ్డి సుధాకర్ విస్తృతంగా పర్యటించి స్థానికుల నుంచి సమస్యలు తెలుసుకున్నారు. వాటి పరిష్కారానికి అధికారులతో ప్రతిపాదనలు సిద్ధం చేయించి ప్రభుత్వానికి పంపడంతో ఒక్కో సచివాలయానికి రూ.20 లక్షల చొప్పున నిధులు మంజూరయ్యాయి. కొన్ని చోట్ల పనులు ప్రాంభించగా.. మరికొన్ని చోట్ల త్వరలో మొదలు కానున్నాయి.

అభివృద్ధి పనుల గుర్తింపు..

గడప గడపకు మన ప్రభుత్వంలో స్థానికులు విన్నవించిన సమస్యలను స్థానిక ఎమ్మెల్యేల చొరవతో ప్రాధాన్యతా క్రమంలో ఇంజినీరింగ్ అధికారులు 21 అభివృద్ధి పనులు గుర్తించి అంచనాలు రూపొందించారు. వాటిని ప్రభుత్వానికి నివేదించగా రూ.1 కోటి నిధులు విడుదల చేసింది. పరిపాలనా అనుమతులు కూడా జారీ కావడంతో పనులు చేపట్టేందుకు రంగం సిద్ధమైంది.



నగరపాలక సంస్థ కార్యాలయం

నగరంలో చేపట్టనున్న అభివృద్ధి పనుల్లో కొన్ని..

- 38వ వార్డు గీతా ముఖర్జీ నగర్‌లోని మసీద్ లైన్‌లో సీసీ రోడ్డు
- 99వ సచివాలయం పరిధిలోని సమతానగర్‌లో సీసీ డ్రైన్, కల్వర్టు
- 32వ వార్డు ముజఫర్ నగర్‌లో సీసీ డ్రైన్, కల్వర్టు
- 32వ వార్డు పరిధిలో 6 నుంచి 13వ లైన్ వరకు సీసీ రోడ్డు
- ముజఫర్ నగర్‌లోని 11, 12వ లైన్‌లో సీసీ రోడ్డు, సీసీ డ్రైన్
- గంగావతినగర్ హంద్రీ నది సమీపంలో సీసీ డ్రైన్, కల్వర్టు
- సాయిబాబా ఆలయం నుంచి గ్రామ స్వరాజ్య సంఘం నగర్ వరకు సీసీ రోడ్డు
- గోవర్ధన్ నగర్‌లో సీసీ రోడ్డు
- వెంకటచలపతినగర్‌లో డ్రైన్ నిర్మాణం, సీసీ ప్యాచ్ పనులు
- వీకర్ సెక్షన్ కాలనీలో సీసీ డ్రైన్లు

పనులు త్వరలో ప్రారంభిస్తాం

గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజలు కోరిన విధంగా స్థానిక ఎమ్మెల్యేల సూచనలతో చేపట్టాల్సిన అభివృద్ధి పనులను గుర్తించాం. ఇప్పటికే ఈ పనులకు సంబందించి నిధులు విడుదలయ్యాయి. త్వరలో టెండర్లు నిర్వహించి పనులు చేపడతాం.
– వేణుగోపాల్, సూపరింటెండెంట్ ఇంజినీర్, నగర పాలక సంస్థ

డిగ్రీ కాలేజీ మాజీ ప్రిన్సిపాల్‌పై నేడు విచారణ

కర్నూలు సిటీ: ప్రభుత్వ పురుషుల డిగ్రీ కాలేజీ మాజీ ప్రిన్సిపాల్ డాక్టర్ పి.కళావతిపై బుధవారం విచారణ జరగనుంది. ఇక్కడ ప్రిన్సిపాల్‌గా పని చేస్తూనే ఆర్జేడీ బాధ్యతలు చూసేవారు. రెండు నెలల క్రితం నెల్లూరు జిల్లాలోని రావూరి డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్‌గా బదిలీ అయ్యారు. కాగా ఆమె అక్కడ బాధ్యతలు తీసుకోలేదు. దీంతో పాటు క్లస్టర్ యూనివర్సిటీ అధికారులపై చేసిన ఫిర్యాదులు, వివిధ అంశాలపై ఏపీ ఉన్నత విద్యా మండలి విచారణ ఆదేశించింది. ఈ విచారణకు రావులపాలెం నుంచి ఓ డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్‌తోపాటు ఏపీ ఉన్నత విద్యా మండలి నుంచి ఓ అధికారి రానున్నట్లు సమాచారం.

నేడు అభినందన సభ

కర్నూలు సిటీ: బి.తాండ్రపాడు వద్ద ఉన్న ఏపీ మైనారిటీ పాలిటెక్నిక్ కాలేజీలో బుధవారం మధ్యాహ్నం 3.30 గంటలకు జాబ్ మేళా ద్వారా ఉద్యోగాలు పొందిన నిరుద్యోగ యువతకు అభినందన సభను నిర్వహించనున్నారు. గత నెలలో వివిధ కంపెనీలతో నిర్వహించిన జాబ్ మేళాలో సుమారుగా 40–50 మందికి ఉద్యోగాలు వచ్చాయి. వీరు నెలకు సుమారు రూ.18 వేల వేతనం అందుకోనున్నారు. ఉద్యోగాలు పొందిన వారికి కోడుమూరు ఎమ్మెల్యే జరదొడ్డి సుధాకర్ చేతుల మీదుగా నియమాక పత్రాలు అందజేసి, సన్మానం చేయనున్నట్లు కాలేజీ వర్గాలు తెలిపాయి.

కానిస్టేబుల్ విధులకు ఆటంకం

కర్నూలు (టౌన్): నంద్యాల చెక్‌పోస్టు వద్ద మంగళవారం కానిస్టేబుల్ రాము విధులకు టెలికామ్‌నగర్‌కు చెందిన ముగ్గురు యువకులు ఆటంకం కలిగించి దురుసుగా ప్రవర్తించారు. కానిస్టేబుల్ ఫిర్యాదు మేరకు సూర్యప్రకాష్, అబ్దుల్ షరీఫ్, రఘులపై కేసు నమోదు చేసినట్లు మూడో పట్టణ పోలీసులు తెలిపారు.

సెల్‌ఫోన్ గొడవ..

బి.క్యాంపు విజ్ఞాన మందిరం సమీపంలో సెల్‌ఫోన్ విషయంలో వెంకటశివ, ఫయాజ్ గొడవ పడ్డారు. ఫయాజ్ రాయితో దాడి చేయడంతో వెంకటశివ మూడో పట్టణ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

బడి బయట పిల్లలను బడిలో చేర్చండి

- జిల్లా కలెక్టర్ జి.సృజన



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ జి.సృజన

కర్నూలు(సిటీ): బడి బయట ఉన్న పిల్లలందరినీ బడిలో చేర్పించేందుకు ప్రత్యేక కమిటీలు ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ నుంచి విద్యాశాఖకు సంబంధించిన అంశాలపై జిల్లా విద్యాశాఖ అధికారులు, ఎంపీడీఓలు, ఇతర శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 5 నుంచి 15 ఏళ్ల వయస్సున్న పిల్లల వివరాలను రోజు వారి నివేదిక రూపంలో అందజేయాలన్నారు. మండలాల వారీగా ఉన్న జనాభా వివరాలు 15 రోజుల్లో ఇవ్వాలన్నారు. కాగా విద్యాహక్కు చట్టం ప్రకారం ప్రైవేటు పాఠశాలల్లో ఉచిత విద్యకు కేటాయించిన 25 శాతం సీట్లలో 197 మంది విద్యార్థులు చేరాల్సి ఉందని, రెండో విడత దరఖాస్తులకు ఈ నెల 6 నుంచి 15వ తేదీ గడువు ఇస్తున్నామని విద్యాశాఖ అధికారులు కలెక్టర్‌కు వివరించారు. కర్నూలు ఎంఈఓ విజయకుమార్ పరిధిలో అత్యధిక సమస్యలు పెండింగ్‌లో ఉండటంతో కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంఈఓను సస్పెండ్ చేయాలని డీఈఓకు సూచించారు. జిల్లాలో కొన్ని పాఠశాలల్లో కట్టెల పొయ్యి మీద మధ్యాహ్న భోజనం తయారు చేస్తున్నారని విద్యాశాఖ అధికారులు కలెక్టర్‌కు వివరించగా.. ఇకపై ఎక్కడైనా కట్టెల పొయ్యిపై వంటలు చేస్తున్నట్లు కనిపిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు. వంట ఏజెన్సీలకు ఎల్పీజీ వినియోగంపై అవగాహన కల్పించాలని డీఆర్‌డీఏ పీడీకి సూచించారు. రక్తహీనతతో ఉన్న యుక్త వయసు బాలికలకు ఐరన్ ఫోలిక్ యాసిడ్ ట్యాబ్లెట్లు అందజేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఐరన్ ట్యాబ్లెట్లు కౌతాళం మండలంలో 1770 మందికి గానూ కేవలం నలుగురికి, మద్దికెరలో 617 మందికి గానూ 12 మందికి మాత్రమే పంపిణీ చేయడంపై కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ నెల 5వ తేదీ నాటికి ఫోలిక్ ట్యాబ్లెట్స్ పంపిణీ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో జెడ్పీ సీఈఓ నాసరరెడ్డి, డీఈఓ రంగారెడ్డి, సమగ్ర శిక్ష అదనపు కోఆర్డినేటర్ డాక్టర్ కె.వేణుగోపాల్, డీఆర్‌డీఏ పీడీ వెంకటసుబ్బయ్య, సమగ్ర శిక్ష ఈఈ కర్రెన్న పాల్గొన్నారు.

వైద్యులు అందుబాటులో ఉండాలి

కర్నూలు(హాస్పిటల్): గ్రామీణ ప్రాంతాల్లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్యులు ప్రజలకు అందుబాటులో ఉండి నాణ్యమైన వైద్యసేవలు అందించాలని కలెక్టర్ డాక్టర్ సృజన ఆదేశించారు. మంగళవారం సాయంత్రం ఆమె కలెక్టర్ బంగ్లా నుంచి వైద్య ఆరోగ్యశాఖ అధికారులు, ప్రోగ్రామ్ అధికారులు, పీహెచ్‌సీ వైద్యాధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణుల్లో రక్తహీనత సమస్య తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. రక్తహీనతను గుర్తించిన బాలికలకు సైతం మూడు రోజుల్లోపు ఐరన్ ఫోలిక్ యాసిడ్ మాత్రలు అందించాలన్నారు. ఎన్‌సీడీ సర్వే ఇప్పటిదాకా ఎంతమంది చేశారు, ఏయే జబ్బులతో ఎంతమంది నమోదయ్యారన్న వివరాలపై ఆరా తీశారు. బీపీ, షుగర్, థైరాయిడ్, క్యాన్సర్ రోగుల వివరాలు సేకరించాలన్నారు. జిల్లాలో కోవిడ్ కేసులు, అందుతున్న వైద్యసేవల గురించి ఆరా తీశారు. జిల్లాలో ఇప్పటిదాకా 57 శాతం మాత్రమే ఫీవర్ సర్వే పూర్తయిందని, ఈనెల 9వ తేదీ నాటికి ఫ్రసర్వే పూర్తి చేయాలని, రోగి లక్షణాలు ఉన్నవారి శ్యాంపిల్స్ సేకరించి పరీక్షలు నిర్వహించాలని చెప్పారు. కొందరు మెడికల్ ఆఫీసర్లు రివ్యూ జరుగుతున్న సమయంలో ఇతర వ్యవహారాల గురించి వారిలోవారు మాట్లాడుతుండటంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. హొళగుందలో రక్తహీనతకు సంబంధించి డేటాను ఏఎన్‌ఎం డిలీట్ చేశారన్న విషయం తెలుసుకుని ఆమెపై చర్యలు తీసుకోవాలని డీఎంహెచ్‌ఓను కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో డీఎంహెచ్‌ఓ డాక్టర్ బి.రామగిడ్డయ్య, డీఐఓ డాక్టర్ ప్రవీణ్‌కుమార్, టీబీ అధికారి డాక్టర్ భాస్కర్, మలేరియా అధికారి నూకరాజు, ఆర్‌బీఎస్‌కే కో–ఆర్డినేటర్ హేమలత పాల్గొన్నారు.

24న ధ్వజస్తంభ ప్రతిష్ఠ

కర్నూలు (న్యూటౌన్): ఈ నెల 24వ తేదీన కర్నూలు మండలం గార్గేయపురంలో శ్రీ చెన్నకేశవస్వామి ఆలయంలో నూతన ధ్వజ స్తంభాన్ని ప్రతిష్ఠిస్తామని దేవదాయ ధర్మాదాయ శాఖ ఈఓ సీతారామిరెడ్డి, దేవస్థానం చైర్మన్ తిరుపాల్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. భక్తులు పాల్గొని స్వామి వారి కృపకు పాత్రులు కావాలని కోరారు.